మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 64 గురువారం 07 - 08 - 2025 పేజీలు: 8 వెల: 4

## పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవు




3లో..

### వైఎస్ జగన్ దెబ్బకు సింగపూర్ వాళ్లు

# ఆంధ్రప్రదేశ్‌కు రానని చెప్పారు

- ఏపీ కేబినెట్ భేటీ.. పలు కీలక నిర్ణయాలు
- సింగపూర్ పర్యటనకు సంబంధించిన అంశాలను మంత్రులతో పంచుకున్న సీఎం చంద్రబాబు
- కల్లు గీత కార్మికుల కోసం కేటాయించిన షాపుల్లో బినామీలు వస్తే సహించను
- ఆటో డ్రైవర్లను వెంటనే పిలిపించి వారితో సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం



మన గళం, అమరావతి : స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్నామని.. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కేబినెట్ మంత్రులను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అయితే ఆగస్ట్ 15వ తేదీ.. స్వాతంత్ర దినోత్సవమని.. ఆ రోజు చాలా కార్యక్రమాలు ఉంటాయని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు మంత్రులు విన్నవించారు. కానీ టైమ్ అడ్జెట్ చేసుకుని ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని వారికి సీఎం సూచించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను ప్రస్తావించడంతోపాటు తమ సింగపూర్ పర్యటనకు సంబంధించిన అంశాలను ఈ సందర్భంగా మంత్రులతో సీఎం చంద్రబాబు పంచుకున్నారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ దెబ్బకు సింగపూర్ వాళ్లు ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రానని చెప్పారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వారు.. అక్కడికి వెళ్లి సింగపూర్ మంత్రులను బెదిరించారని చెప్పారు. కేసులు పెడతామని బెదిరించి వాళ్లను భయపెట్టే పరిస్థితి జరిగిందని తెలిపారు. అలాగే సీడ్ క్యాపిటల్‌లో తాము భాగస్వామ్యం కాబోమని వారు స్పష్టం చేశారని పేర్కొన్నారు. పార్టనర్ షిప్ సమ్మిట్‌కు వాళ్లని రమ్మని ఆహ్వానించామని తెలిపారు. స్నేహ సంబంధాలు కొనసాగించాలని వారిని సూచించినట్లు పేర్కొన్నారు. అందుకు వాళ్లు సైతం ఒప్పుకున్నారని చెప్పారు.. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 41 సమావేశాల్లో పాల్గొన్నానన్నారు. ఇక ఈ కేబినెట్ సమావేశంలో కొత్త బార్ పాలసీను ఆమోదించారు. అయితే కల్లు గీత కార్మికుల కోసం

2 లో..



### ఎంపీ బైరెడ్డి శబరిని కలిసిన

## శెఫాలీ కశ్యప్

మనగళం, కర్నూలు సిటీ : నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని బుధవారం రాష్ట్ర సేవిక సమితికి చెందిన సభ్యురాలు, నేషనల్ యూత్ పార్లమెంట్ (బీజేవైఎం) విజేత, అల్లాహాబాద్ హైకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న శెఫాలీ కశ్యప్ మర్యాద పూర్వకంగా కలిశారు. శెఫాలీ కశ్యప్ రచించిన "ది మిథ్ బస్టెడ్: వుమెన్ ఇన్ ఆర్ఎస్ఎస్ అండ్ సిస్టర్హుడ్ ఇన్ సాఫ్రన్" అనే ప్రేరణాత్మక పుస్తకాన్ని ఎంపీ బైరెడ్డి శబరికి అందజేశారు. దేశభక్తితో మన దేశం గురించి రచనలు చేస్తున్న శెఫాలీ కశ్యప్ తోపాటు యువ రచయితలకు ఈ సందర్భంగా ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు.

# రేషన్ పంపిణీలో గోల్‌మాల్

- మృతులకూ రేషన్ సరుకులు.. - కార్డుల్లో తొలగించని పేర్లు



మన గళం, అమరావతి : అర్హులకు మాత్రమే రేషన్ ఫలాలు అందడంతో పాటు బియ్యం పక్కదారి పట్టడానికి వీలులేదన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితులు ఉంటున్నాయి. ఈకేవైసీ ప్రక్రియ నత్తనడకనే సాగుతుండటంతో అర్హత లేకపోయినా పలువురు లబ్ధి పొందుతున్నారని సమాచారం. ప్రజాధనం వృథాకు అడ్డుకట్ట పడాలంటే ఈ-కేవైసీతో పాటు క్షేత్రస్థాయి సర్వేతోనే సాధ్యమవుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అర్హులకు లబ్ధి చేకూరడం ఎంత ముఖ్యమో అనర్హుల ఏరివేత కూడా పక్కాగా ఉండాలని పాలకులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వం అనర్హుల ఏరివేతపై దృష్టి పెట్టకపోగా... ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొంది. రాజకీయ సిఫార్సులే ప్రామాణికంగా రేషన్ కార్డులను ఇబ్బడిముబ్బడిగా జారీ చేయడంతో జిల్లాలో కార్డుదారులు అమాంతం పెరిగిపోయారు. ఏటికేడు లబ్ధిదారుల సంఖ్యలో

2 లో..

## రైతులను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు



మన గళం డెస్క్ : సైబర్ నేరస్థులు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. కొత్త కొత్త ఎత్తులు వేస్తూ ప్రజలను యథేచ్ఛగా మోసం చేస్తున్నారు. అయితే ఈ సారి ఏకంగా ప్రభుత్వ పథకానికే ఎసరు పెట్టారు. కూటమి ప్రభుత్వం ఇటీవల 'అన్నదాత సుఖీభవ' పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో అర్హులకు మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.20 వేలు జమ చేస్తోంది. ఈ పేరుతో సైబర్ నేరగాళ్లు వారం రోజులుగా పలు ప్రాంతాల్లో రైతులకు ఫోన్ చేసి 'మీ ఖాతాలో

## రూ.900 కోట్లతో రాజధాని గ్రామాల్లో అభివృద్ధి




మన గళం, అమరావతి : రాజధాని గ్రామాల్లో రూ.900 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తామని, ఆగస్టు ఆఖరుకు డీపీఆర్ సిద్ధం అవుతుందని, త్వరలో టెండర్లు పిలిచి రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, తదితర పనులు ప్రారంభిస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ

2 లో..

### మరో హామీ నిలబెట్టుకున్న

## మంత్రి నారా లోకేశ్



మన గళం, అమరావతి : నాలుగు దశాబ్దాలుగా సొంత గూడు కోసం ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబాల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. కర్నూలు గూడెం కొట్టాల ప్రాంతంలోని 150 నిరుపేద

2 లో..





### పాకిస్థాన్, చైనాలపై జెలెన్‌స్కీ

## సంచలన ఆరోపణలు

- రష్యా తరఫున చైనా, పాక్ కిరాయి సైనికులు పోరాడుతున్నారని జెలెన్‌స్కీ ఆరోపణ

మన గళం, న్యూఢిల్లీ : ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరఫున చైనా, పాకిస్థాన్‌తో పాటు మరికొన్ని దేశాలకు చెందిన కిరాయి సైనికులు పోరాడుతున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. రష్యా పక్షాన పోరాడుతున్న ఈ విదేశీ కిరాయి మూకలకు తగిన విధంగా బదులిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. జెలెన్‌స్కీ కీలకమైన వోవ్‌చాన్స్క్ యుద్ధ క్షేత్రంలో పర్యటించి,

2 లో..

### సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోలపై

## సుప్రీం కీలక తీర్పు



మన గళం, న్యూఢిల్లీ : సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోను వినియోగించే విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి భారీ ఊరట కల్పించింది. జులై 31న ఇచ్చిన తన ఉత్తర్వులో సంక్షేమ పథకాల్లో ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలను ఉపయోగించకూడదని డీఎంకే ప్రభుత్వాన్ని హైకోర్టు

2 లో..



### వడ్డీ రేట్ల కోతకు

## ఆర్బీఐ బ్రేక్

- అమెరికా టారిఫ్‌ల భయంతోనే కీలక నిర్ణయం!

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించనున్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆచితూచి అడుగు వేసింది. వరుసగా మూడుసార్లు వడ్డీ రేట్లను తగ్గించిన కేంద్ర బ్యాంకు, ఈసారి మాత్రం కోతలకు బ్రేక్ వేసింది. రెపో రేటును 5.5 శాతం వద్ద యథాతథంగా ఉంచుతున్నట్లు బుధవారం

2 లో..

### తొలగించిన 65 లక్షల ఓటర్ల

## వివరాలు సమర్పించండి



మన గళం డెస్క్ : బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిపిన ఎన్నికల కమిషన్ ఈనెల 1న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. 65 లక్షల మందిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్టు ప్రకటించింది. దీనిపై సుప్రీంకోర్టు బుధవారంనాడు ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. తొలగించిన 65 లక్షల

2 లో..

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# పాకిస్థాన్, చైనాలపై జెలెన్స్కీ సంచలన ఆరోపణలు

అక్కడి సైనికులతో సమావేశమయ్యారు. ఈ పర్యటన అనంతరం జెలెన్స్కీ సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలు వెల్లడించారు. "వోవ్‌చాన్స్క్ ప్రాంతంలో దేశాన్ని రక్షిస్తున్న మన సైనికులను కలిశాను. యుద్ధ క్షేత్రంలోని పరిస్థితులు, రక్షణ వ్యూహాలపై కమాండర్లతో చర్చించాను. ఈ సందర్భంగా, రష్యా పక్షాన చైనా, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తో పాటు కొన్ని ఆఫ్రికా దేశాలకు చెందిన కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు మా సైనికులు నివేదించారు. దీనిపై మేము తప్పకుండా స్పందిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు జెలెన్స్కీ కృతజ్ఞతలు తెలిపి, వారికి ప్రభుత్వ అవార్డులను ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్ యుద్ధభూమిలో పోరు తీవ్రంగా కొనసాగుతోంది. ఆగస్టు 5న ఒక్కరోజే రష్యా, ఉక్రెయిన్ దళాల మధ్య 143 సార్లు భీకర ఘర్షణలు జరిగినట్లు ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ తెలిపారు. ముఖ్యంగా పోక్రోవ్స్క్ సెక్టార్‌లో అత్యంత తీవ్రమైన దాడులు జరిగినట్లు ఆగస్టు 6న ఉదయం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గత 24 గంటల్లో రష్యా దళాలు రెండు క్షిపణి దాడులు, 107 వైమానిక దాడులు చేశాయని, ఉక్రెయిన్ సైనిక స్థావరాలు, జనావాసాలపై 147 గైడెడ్ బాంబులను ప్రయోగించాయని ఆ నివేదిక వివరించింది. రష్యా దాడులకు ప్రతిగా, తమ వైమానిక, క్షిపణి దళాలు రష్యాకు చెందిన 14 లక్ష్యాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. వీటిలో శత్రువుల కమాండ్ పోస్టులు, సైనిక స్థావరాలు, ఆయుధాగారాలు ఉన్నట్లు స్పష్టం చేసింది.

# తొలగించిన 65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించండి



ఓటర్ల వివరాలను ఆగస్టు 9వ తేదీలోగా తమకు సమర్పించాలని ఆదేశించింది. బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌ను అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ అనే ఎన్జీఓ గతంలో సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితా అనంతరం మరోసారి కోర్టును అశ్రయించింది. రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాను ఇచ్చినప్పటికీ ఓటర్ల తొలగింపునకు కారణాలు చెప్పలేదని ఎన్జీపీ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తమ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం స్పందిస్తూ, తొలగించిన ఓటర్ల జాబితా వివరాలు ఇప్పటికే రాజకీయ పార్టీలకు ఇచ్చినందున ఆ వివరాలను ఎన్జీవోకు కూడా అందించాలని ఈసీ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. ప్రస్తుతం జాబితా వివరాలను అందిస్తుందని, ఆ తర్వాత కారణాలను వివరిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

# రేషన్ పంపిణీలో గోల్‌మాల్

పెరుగుదల నమోదు కావడమే తప్ప తొలగించిన వారి సంఖ్య కనిపించదు. అయితే అర్హులు ఎందరో రేషన్ ఫలాలు అందుకోలేక పోతున్నారు. వారిని అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడంతో సరిపెడుతున్నారే కానీ కనికరించడంలేదు. బయోమెట్రిక్‌ను దుర్వినియోగిస్తూ కుటుంబంలో చనిపోయిన వారు ఉన్నా.. వారి సమాచారం ఇవ్వకుండా రేషన్ లబ్ధి పొందుతున్నవారూ ఉన్నారు. గుంటూరు, పల్నాడు, పరిధిలో దాదాపు రెండున్నర లక్షల మంది అర్హత లేకపోయినా రేషన్ ఫలాలు అందుకుంటున్నట్లు తెలుస్తోంది. దాదాపు 21 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం మూడు జిల్లాల పరిధిలోని కార్డుదారుల కోసం కేటాయిస్తోంది. ఇందుకు సగటున రూ. వంద కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. కానీ అనర్హులు రేషన్ లబ్ధి పొందుతుండడం వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3 కోట్లు అదనంగా ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది.భాగం కూడా సమన్వయంతో అడుగులేయాలి. కానీ క్షేత్రస్థాయిలో అది లోపించింది. మరణ ధ్రువీకరణ పత్రాన్ని వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా అందిస్తే తప్ప రెవెన్యూ విభాగం మరణాలపై స్పదించడం లేదన్న విమర్శలున్నాయి. ఈ పత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయగానే ఆటోమెటిక్‌గా వారి పేరు రేషన్ కార్డు నుంచి తొలగించబడుతుంది. కానీ ఈ పని అందరూ స్వచ్ఛందంగా చేయకుండా ఏళ్ల తరబడి లబ్దిపొందుతూనే ఉన్నారు. సచివాలయ సిబ్బంది కూడా మరణాలపై దృష్టి పెట్టడం లేదు. పౌర సరఫరాల శాఖ ఈ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో అంతిమంగా ప్రభుత్వ ఖజానాపై ఆదనపు భారం పడుతోంది.

## మరో హామీ నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేశ్

కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలు అందడంతో వారి సొంతింటి కల సాకారమైంది. మంత్రి నారా లోకేశ్ తన 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. కర్నూలు నగరంలోని అశోక్‌నగర్ పరిధిలో ఉన్న నగరపాలక సంస్థకు చెందిన పంప్‌హౌస్ ప్రాంతంలో దాదాపు 150 కుటుంబాలు గత 40 ఏళ్లుగా పూరిగుడిసెల్లో నివసిస్తున్నాయి. తమకు శాశ్వత నివాస హక్కు కల్పించాలని వారు ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులను వేడుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో, యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్ కర్నూలు వచ్చినప్పుడు, అప్పటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి టీజీ భరత్ ఆధ్వర్యంలో ఈ గూడెంకొట్టాల వాసులు ఆయనను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి సమస్యను సావధానంగా విన్న లోకేశ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి శాశ్వత పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఆ ఇచ్చిన మాటకు కట్టుబడి, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చర్యలు చేపట్టారు. దీని ఫలితంగా, 2025 జనవరిలో జీవో నెం.30ను జారీ చేసి, కోట్ల రూపాయల విలువైన ఎకరా ప్రభుత్వ స్థలాన్ని ఈ పేదలకు కేటాయించారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ స్వయంగా లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

# సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోలపై సుప్రీం కీలక తీర్పు

మొదటి పేజీ తరువాయి

ఆదేశించింది. పిటిషనర్ అయిన ఏఐఏడీఎంకే నాయకుడు సీవీ షణ్ముగంకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్ వీ అంజరియాలతో కూడిన ధర్మాసనం రూ.10 లక్షల జరిమానా విధించింది. తమిళనాడు సంక్షేమ పథకాలలో ముఖ్యమంత్రి పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ సరికాదని, చట్టపరమైన ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం సంక్షేమ పథకాల్లో సీఎం ఫొటోలను వినియోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ మద్రాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన కోర్టు.. కొత్తగా తీసుకురానున్న సంక్షేమ పథకాల్లో ప్రస్తుతం జీవించి ఉన్న నాయకుల పేర్లు వాడొద్దని.. పథకాలపై ప్రచారం చేసుకునే సమయంలో మాజీ సీఎంల ఫొటోలు, పార్టీ జెండాలను ఉపయోగించకుండా నిషేధం విధించింది. దీన్ని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారించిన సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఎన్నో రాష్ట్రాల్లో నాయకుల పేర్లతో పథకాలు ప్రవేశపెట్టారని.. దీనిపై ఎలాంటి న్యాయపరమైన నిషేధాజ్ఞలు లేవని ధర్మాసనం ఎదుట తమిళనాడు ప్రభుత్వం తెలిపింది. పిల్ దాఖలు చేసిన పిటిషనర్‌పై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయంలో పిటిషనర్‌కు ఆందోళన ఉంటే.. అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నేతలతో ఉన్న పథకాలను ఎందుకు సవాల్ చేయలేదని ప్రశ్నించింది. పలు పథకాలకు ప్రధాని, రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తుల ఫొటోలు ఉపయోగించుకోవచ్చని సుప్రీం గతంలో అనుమతి ఇచ్చిందని.. దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారని.. రాజకీయ పోరాటాల కోసం కోర్టులను వేదికలు చేసుకోవద్దంటూ హెచ్చరిస్తూ పిటిషనర్‌కు రూ.10లక్షల జరిమానా విధించింది.



# వడ్డీ రేట్ల కోతకు ఆర్బీఐ బ్రేక్

ప్రకటించింది. ఈ మేరకు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఈ నెల 4న ప్రారంభమైన ఎంపీసీ సమావేశంలో దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ఈ నెల 7 నుంచి భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం టారిఫ్‌లు విధించనుండటం వంటి అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితులు ఈ నిర్ణయంపై తీవ్ర ప్రభావం చూపాయి. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 2.1 శాతానికి తగ్గి, ఆర్బీఐ లక్ష్యమైన 4 శాతం కంటే చాలా తక్కువ స్థాయిలో ఉన్నప్పటికీ, ముందు జాగ్రత్త చర్యగా వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని కమిటీ భావించింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్, జూన్ నెలల్లో ఆర్బీఐ మొత్తం 100 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించిన విషయం తెలిసిందే. పండుగల సీజన్‌కు ముందు గృహ, ఎంఎస్ఎంఈ, రిటైల్ రంగాల్లో రుణాలకు డిమాండ్ పెంచడం ద్వారా ఆర్థిక వృద్ధికి ఊతమివ్వాలనే లక్ష్యంతో ఆ కోతలు విధించారు. గత మూడు కోతల ప్రభావం మార్కెట్‌పై ఏ మేరకు ఉందో అంచనా వేసేందుకే ఈసారి విరామం తీసుకున్నట్లు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిని అవలంబిస్తామని, బాహ్య ఒత్తిళ్ల నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడుకుంటూ దేశీయ డిమాండ్‌కు మద్దతు ఇస్తామని ఆర్బీఐ స్పష్టం చేసింది. భవిష్యత్తులో పరిస్థితులను బట్టి అవసరమైతే మరిన్ని కోతలకు అవకాశం ఉందని సంకేతాలిచ్చింది.

## వైఎస్ జగన్ దెబ్బకు సింగపూర్ వాళ్లు
# ఆంధ్రప్రదేశ్‌కు రానని చెప్పారు

కేటాయించిన షాపుల్లో బినామీలు వస్తే సహించనని హెచ్చరించారు. ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత ప్రయాణం ప్రారంభానికి ముందే.. ఆటో డ్రైవర్లను పిలిపించి వారితో మాట్లాడాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సమావేశంలో సూచించారు. ఈ సూచనపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఆటో డ్రైవర్లను వెంటనే పిలిపించి వారితో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. వారితో మాట్లాడి తగిన సహాయం చేయాలని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా సూచించారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ప్రమోషన్‌లో భాగంగా ఏపీకి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు జులై 26 నుంచి 31వ తేదీ వరకు సింగపూర్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులు, కంపెనీ సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో ఆయన వరుసగా భేటీలు నిర్వహించారు. ఆ క్రమంలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, వనరులు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పారిశ్రామిక పాలసీ, భూమి లభ్యత తదితర అంశాలను వారికి సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు.

ఇక ఈ ఏడాది నవంబర్‌లో విశాఖపట్నం వేదికగా పెట్టుబడుల సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సింగపూర్‌లోని పారిశ్రామికవేత్తలను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. అలాగే ఈ పర్యటనలో భాగంగా రౌండ్ టేబుల్ సమావేశాలు సైతం నిర్వహించారు. అదే విధంగా ఆ దేశంలోని వివిధ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ సంస్థలను సీఎం చంద్రబాబు సందర్శించిన విషయం విదితమే. ఈ సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు వెంట.. మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, పి నారాయణతోపాటు పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.




# రైతులను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లు

సాయాన్ని జమ చేస్తామని' నమ్మిస్తున్నారు. నిజమేనని నమ్మి కేటుగాళ్లు చెప్పినట్లే చేస్తూ డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఏపీకే ఫైళ్లను వాట్సాప్‌లో పంపి, తద్వారా ఫోన్లలో విలువైన సమాచారం తస్కరిస్తున్నారు. ఆపై ఖాతాల నుంచి డబ్బు డ్రా చేస్తున్నారు. విషయం తెలియక చాలా మంది మోసపోతున్నారు. సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్‌ను ఏపీకే ఫైళ్ల ద్వారా చొప్పిస్తున్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వీటిని క్లిక్ చేస్తే వివరాలు నమోదు చేసుకోవచ్చని నమ్మిస్తారు. ఇవి అత్యవసరం, తప్పనిసరి అని ఒత్తిడి తెచ్చి డౌన్‌లోడ్ చేయిస్తారు. వీటిని ఇన్‌స్టాల్ చేయగానే ఫోన్ హ్యాక్ అయి నియంత్రణ మోసగాళ్ల చేతిలోకి వెళ్తోంది. మొబైల్‌లో వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు, నెంబర్లు, ఎస్ఎంఎస్‌లు, వంటివి అవతల వ్యక్తులకు సులభంగా చేరతాయి. అందులో సమాచారాన్ని మార్చేసి అదనంగా మాల్‌వేర్‌లను ఇన్‌స్టాల్ చేస్తారు. ఫోన్‌లో బ్యాంకు ఖాతాలు, సోషల్ మీడియా ప్రొఫైల్స్, వ్యక్తిగత మెయిల్స్ మోసగాళ్ల నియంత్రణలోకి వెళ్తున్నాయి. బ్యాంకు ఖాతాల నుంచి అనధికార లావాదేవీలు నిర్వహించి నగదును తమ ఖాతాలకు బదిలీ చేసేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల రైతుకు ఇటీవల వాట్సాప్‌లో పీఎం కిసాన్ పేరుతో ఎస్ఎంఎస్ ఏపీకే ఫైల్ కూడా వచ్చింది. వెంటనే ఓ వ్యక్తి ఫోన్ చేసి నేను సచివాలయం నుంచి మాట్లాడుతున్నా పథకానికి అర్హత పొందాలంటే మీ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందుకు ఏపీకే ఫైల్‌పై క్లిక్ చేయాలన్నాడు. నిజమని నమ్మి పేరు, ఆధార్ నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు ఎంటర్ చేశారు రైతు. ఇటీవల బ్యాంకు ఖాతా పరిశీలించగా రూ.2.30 లక్షలు డ్రా అవడం చూసి నిర్ఘాంతపోయారు. అలాగే తిరువూరులో ఓ రైతుకూ పీఎం కిసాన్ పేరుతో సంక్షిప్త సందేశం వచ్చింది. ఏపీకే ఫైల్‌పై క్లిక్ చేసి నిర్దేశిత ఫారంలో వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలని అపరిచితుడు ఫోన్ చేసి సూచించాడు. అతడు సూచించినట్లే రైతు వివరాలన్నీ నమోదు చేశారు. మర్నాడు ఖాతా నుంచి రూ.33 వేలు బదిలీ అయింది.

# రూ.900 కోట్లతో రాజధాని గ్రామాల్లో అభివృద్ధి

పేర్కొన్నారు. మంగళవారం రాత్రి విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని రైతు ఐకాస ప్రతినిధులతో మంత్రి, కమిషనర్ కన్నబాబు భేటీ అయ్యారు. ఆ క్రమంలో రైతులు పలు సమస్యలను మంత్రికి వివరించారు. అమరావతికి చట్టబద్ధత తెచ్చేలా పార్లమెంటులో చట్టం చేసేలా చొరవ చూపాలని రైతులు మంత్రిని కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ, వీలైతే ఈ సమావేశాల్లో జరిగేలా చూస్తామనీ, లేదంటే తర్వాత సమావేశాల్లోనైనా అయ్యేలా బాధ్యత తీసుకుంటామన్నారు.

**- అవినీతి అధికారులపై ఫిర్యాదు - చర్యలకు మంత్రి సిఫార్సు**

రైతులు గ్రామకంఠం, పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో వచ్చిన ప్లాట్ల సమస్యలు పరిష్కరించాలని కోరగా వాటిని వెంటనే చక్కదిద్దుతామని మంత్రి చెప్పారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న మూడు రాజధానుల పిటిషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రైతులు సూచించారు. ఆ విషయంలో న్యాయ సలహా మేరకు సాగుతామని మంత్రి బదులిచ్చారు. అర్హులకు ఇంకా కౌలు సరిగా జమ కావడం లేదని రైతులు తెలపగా, నెలలోగా ఆ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి వారికి చెప్పారు. ఆర్5 జోన్ సమస్యనూ త్వరగా కొలిక్కి తెస్తామన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ నిర్వాకంతో టిడ్కో ఇళ్లు పూర్తి కాకుండా ఈఎంఐలు కట్టాల్సి వస్తోందని రైతులు వాపోయారు. జరీబు, మెట్ట భూముల ప్లాట్ల కేటాయింపులో తేడాలు సవరిస్తామనీ, హెచ్‌టీ లైన్లను భూగర్భంలోకి మార్చేందుకు రూ.1,200 కోట్లతో పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

మనగళం, కర్నూలు క్రైం: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసులు నేరనియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలు అణచివేసే దిశగా ముందుకు సాగుతున్నారు పోలీసులు. జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా పాత నేరస్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలు అరికట్టే దిశగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నారు. రోడ్డు నిబంధనలు వివరిస్తూ వాహనచోదకులను చైతన్య పరుస్తున్నారు. బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద పోలీసులు భద్రతను పటిష్టం చేశారు.





# జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు



మనగళం, కర్నూలు సిటీ : జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ – ఎయిడ్స్ నియంత్రణ అండ్ నివారణా విభాగం, ప్రాంతీయ పర్యవేక్షణా అధికారి, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియేట్, కర్నూలు సంయుక్తంగా హెచ్ఐవీ అండ్ డ్రగ్స్ పై విద్యార్థులు, యువతకు అవగాహన కలిగించేందుకు బుధవారం జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. కర్నూలు నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్ మోడల్) నందు నిర్వహించిన క్విజ్ పోటీలకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో 11వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్, ఇంచార్జ్ ఆర్. ఐ. ఓ. షేక్ షావలీ మాట్లాడారు. యువత అవగాహనా రాహిత్యం, సామాజిక మద్యమాల ప్రభావం మూలంగా తప్పుడు దారిలో వేళ్తున్నారని, సన్మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు ప్రధానం చేశారు. మొదటిస్థానంలో ఆయేషా సిద్ధిఖా, వైష్ణవి ప్రభుత్వ జూనియర్ కళాశాల ( టౌన్ మోడల్ ), కర్నూలు నిలవగా, రెండవ స్థానంలో ఎస్టీ జోసేఫ్ జూనియర్ కళాశాల, కర్నూలు విద్యార్థినులు జయశ్రీ , అక్షయ నిలిచారు. అలాగే మూడవ స్థానములో నారాయణా కళాశాల ఎస్బీఐ బ్రాంచ్ విద్యార్థులు ఎస్ఎండీ సాదిక్ అబ్రజ, శ్రీ వర్ధన్ నిలిచారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి , వివిధ కళాశాల అధ్యాపకులు, గణాంక అధికారి దేవి శంకర్ గౌడ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కర్నూలు ఐ సి టి సి – కౌన్సిలర్లు గౌస్ బాషా, జగదీశ్వరుడు, చైల్డ్ ఫండ్ ఇండియా నాగరాజు, విజయ మహిళా మండలి సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ విజయా, ష్రెడ్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మునీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవు

- అనధికార నిర్మాణాలు, ఆక్రమణలపై ఉపేక్షించొద్దు
- సి అండ్ డి వేస్ట్ మేనేజ్మెంట్ పకడ్బందీగా నిర్వహించాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో పారిశుధ్యం మెరుగుపడుతుంది, ఇక అనధికార నిర్మాణాలు, ఆక్రమణలపై కొరడా ఝులిపించాలి, పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయిలో పర్యటించాలి అని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. పద్ధతి మార్చుకోకపోతే, ఆశించిన స్థాయిలో ఫలితాలు లేకపోతే వివరణలు తీసుకునే పద్ధతి ఇక ఉండబోదని, కఠిన చర్యలు తీసుకోక తప్పదని కమిషనర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మునుపటిలా పనిచేస్తామంటే కుదరదు, కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూనే ఉండాలని తేల్చి చెప్పారు. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను ఉపేక్షించొద్దని, వాటిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగించే ఆక్రమణలను తొలగించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భవన నిర్మాణ వ్యర్థాల సేకరణకు నూతనంగా తీసుకొచ్చిన విధానాన్ని ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని, సీ అండ్ డీ వ్యర్థాల సేకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక నెంబర్లపై 08518-221847 లేదా ౦91-9100030250 ప్రచారం కల్పించాలని సూచించారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని యజమానులు వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి. చిన్న రహిమాన్

మన గళంప్యాపిలి మండలం జలదుర్గం పి. హెచ్. సి సెంటర్లో ఆశా కార్యకర్తల సమావేశం భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి %జ×ఖ% ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి %ూ.ూ%. చిన్న రహిమాన్, సహాయ కార్యదర్శి పద్మశాలి శ్రీనివాసులు, ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కృష్ణవేణి గార్లు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు రూపాయలు ఇవ్వాలని, 18 సంవత్సరాల నుండి ఆశా వర్కర్ గా పనిచేస్తున్న నేటికీ వేతనం పెరగడం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలి, ప్రతి ఒక్క ఆశ వర్కర్ కు కొత్త సెల్ ఫోన్ మరియు 5జి సిమ్ములులు ఇవ్వాలి, ఒప్పందం జీవోలు అమలు చేయాలి, మట్టి ఖర్చులకు జీవో అమలుచాలి, ఆశ వయస్సు 60 సంవత్సరాలు నిండు న టువంటి వారికి రిటైర్మెంట్ చేయరాదు ,62 సంవత్సరాల కు పెంచాలి, జీవో విడుదల చేయాలి,62 సంవత్సరాలు జీవో వచ్చేవరకు ఆశలకు రిటైర్మెంట్ చేయరాదు. ఆశా కార్యకర్తలకు రికార్డులను ప్రభుత్వమే ఇవ్వాలి, ప్రభుత్వ సెలవులు మరియు ప్రసనానంతర సెలవులను ఆశ కార్యకర్తలకు ఉండేటట్లు చూడాలి, డెలివరీ కేసుకు వచ్చినప్పుడు ఫ్యామిలీ ప్లానింగ్ గర్భవతులు చెకప్ సేవలందించడం కోసం వచ్చినప్పుడు ఆశాలకు రవాణా చార్జీలను మరియు రోజువారి ఖర్చులకు ఇవ్వాలి, గ్రామంలో పట్టణం ప్రాంతంలో ఎక్కువ జనాభా ఉన్న చోట అదనపు ఆశలను నియమించాలి, వేరే సచివాలయం లోకి ట్రాన్స్ఫర్ కావాలి, గల్లా పరీక్షల బాక్స్ ఆశలతో తెప్పించరాదన్నారు. ఈ సమావేశంలో రాజ్ కుమార్, పి రాంబి,దేవమ్మ, నాగవేణి ,సుభద్ర, సుశీల, సుజాత, సరస్వతి, రాధమ్మ, పద్మావతి, సరోజమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఇమ్రాన్ ప్రతాప్ గడి జన్మదిన వేడుకలు



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ ఖజా హుస్సేన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ గడి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్సీ, మాజీ డీసీసీ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు కేక్ కట్ చేసి ఇమ్రాన్ ప్రతాప్కు శుభాకాంక్షలు తెలియ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ముషీద్ పీర్ ఖాద్రి పాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు పగిడాల అమన్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్ వలి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ ఎన్ సీ బజారన్న, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ ఈ లాజరస్, మైనార్టీ సెల్ నాయకులు వసీబాషా, కిసాన్ సెల్ నాయకులు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ కర్నూలుగా తీర్చిదిద్దండి

- పారిశుధ్యం, ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





మనగళం, కర్నూలు: కర్నూలు నగరాన్ని స్వచ్ఛ కర్నూలుగా తీర్చిదిద్దడం తో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ ల్లో పారిశుధ్యం, ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాలు సక్రమంగా జరగాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యకలాపాలపై ఈఈ లు, డీఈ లు , టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్ స్పెక్టర్ లు, రెవెన్యూ ఆఫీసర్లు, మేనేజర్, ఏఈ లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 1200 మంది శానిటరీ వర్కర్ లు ఉన్నప్పటికీ నగరాన్ని శుభ్రంగా ఉంచకపోతే ఎలా అని కలెక్టర్ ప్రశ్నించారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయించకపోతే శానిటరీ ఇన్ స్పెక్టర్ లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బి క్యాంప్ నుండి రాజవిహార్ వరకు రోడ్ శుభ్రంగా లేదని పలు మార్లు చెప్పినప్పటికీ మార్పు రాలేదని, సంబంధిత శానిటరీ ఇన్ స్పెక్టర్ లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అదే విధంగా ప్రజారోగ్య అధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కర్నూలు నగర సుందరీకరణలో భాగంగా బి క్యాంప్ నుండి బస్ స్టాండ్ వరకు ఉన్న డివైడర్ లకు ఆకర్షణీయంగా పెయింటింగ్ వేయించాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఎన్క్యాప్ ఫండ్స్ కింద 8 నెలల కిందట రూ. 7 కోట్లతో పనులు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చామని, ఈ పనులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. పెండింగ్ లో ఉన్న పనులను కూడా 10 రోజులలో మొదలు పెట్టాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ప్లాస్టిక్ యూస్ మేనేజ్మెంట్ కి సంబంధించి షాప్ ల వద్దకు వెళ్ళి ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రజారోగ్య అధికారిని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ కు సంబంధించి ప్రతి రోజు ప్రతికూల వార్తలు వస్తున్నాయని, వాటిపై ఎంక్వైరీ చేసి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ సిటీ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు. ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ కమిషనర్ లతో మాట్లాడుతూ జనరల్ ఫండ్స్, 15 ఫైనాన్స్ కింద వచ్చిన నిధులను ఏ విధంగా ఉపయోగించాలి అని యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదోని బసాపురం ట్యాంక్ కు సంబంధించిన మరమ్మతులను రెనోవేషన్, రెస్టోరేషన్ (%===%) పథకం కింద చేపట్టే విధంగా ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ లతో మాట్లాడి, ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఆదోని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. టిడ్కో గృహాలకు సంబంధించి గృహాలు కేటాయింపు చేసిన వారికి హౌస్ నెంబర్ లు ఇవ్వాలని, జాయింట్ కలెక్టర్ తో మాట్లాడి రేషన్ షాప్ ఏర్పాటు చేయించాలన్నారు. అంగన్వాడి సెంటర్ ఏర్పాటు కూడా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్లు విశ్వనాథ్,కృష్ణ, గంగిరెడ్డి, గూడూరు నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, కర్నూలు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

- బాలగంగాధర్ తిలక్ నగర్ ప్రజలు రాస్తారోకో

మనగళం, కర్నూలు సిటీ : గత 50 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నా బాలగంగాధర్ తిలక్ నగర్ గుడిసె వాసులకు జీవో నెంబర్ 30 ప్రకారం ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు లో ఆ కాలనీ ప్రజలు సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారాకో నిర్వహించారు. వార్డు సీపీఎం కార్యదర్శి సి. చలపతి అధ్యక్షతన జరిగిన రాస్తారోకో కార్యక్రమంలో పార్టీ న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలోని 42వ వార్డు బాలగంగాధర్ తిలక్ నగర్ లో బడుగు బలహీన వర్గాల ప్రజలు రోజువారి కూలీలుగా గుడిసెలలో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కార్పొరేషన్ అధికారులు స్లమ్ ఏరియాగా గుర్తించి సీసీ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టారని, ఇళ్లకు ఇంటి పన్నులు, కరెంటు మీటర్లు రావడంతో కొందరు పక్కా ఇళ్లను నిర్మించుకున్నారని గుర్తు చేశారు. జీవో నెంబర్ 30 ప్రకారం రెగ్యులరైజ్ చేస్తూ ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. లేదంటే పేదలను సమీకరించి ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సి.గురు శేఖర్, నగేష్. సిహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, కిరణ్మయి, ఎస్ రోశయ్య, జె శ్రీనివాసులు, కాలనీవాసులు శంకరమ్మ ఎం వెంకటేశ్వర్లు, మల్లికార్జున, సూరి, వెంకటేశ్వర్లు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



# లులు మాల్ కు కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలి

మనగళం, ప్రత్యేక ప్రతినిధి : పౌర వేదిక ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని పాత బస్టాండ్ లో బహుళ జాతి సంస్థ లులు మాల్ కు కేటాయించిన 4.17 పాత బస్టాండ్ స్థలాన్ని రద్దు చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నేతలు వడ్డే శోభనాద్రీశ్వరరావు, సుంకర రాజేంద్రప్రసాద్, సిహెచ్ బాబురావు లతోపాటు ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు, పౌర సంస్థల నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ లులు మాల్ కు ప్రపంచంలో ఎక్కడ ఏ ప్రభుత్వము ప్రభుత్వ స్థలాలు ఇవ్వలేదన్నారు. భారతదేశంలో డీమార్ట్, బెస్ట్ ప్రైజ్, రత్నదీప్ లాంటి పెద్ద పెద్ద మాల్స్ కి ఏ ప్రభుత్వము స్థలాలు కేటాయించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి మంత్రివర్గ సమావేశాలలో ప్రభుత్వ భూములను, ఆస్తులను, రైతుల పంట భూములను బడా పారిశ్రామిక వేత్తలకు అభివృద్ధి పేరుతో భూపందేరం చేస్తున్నారని విమర్శించారు. విజయవాడ, విశాఖపట్నం లో లులు మాల్ కు కేటాయించిన భూములను రద్దు చేయాలని, గత 14 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములపై సిబిఐ విచారణ లేదా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



# ప్రజా సమస్యల ను పరిష్కరించండి

మనగళం, కర్నూలు సిటీ : సీపీఎ కర్నూల్ మండల కమిటీ సమావేశం మండల నాయకులు రాఘవేంద్ర అధ్యక్షతన బుధవారం స్థానిక సుందరయ్య భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా సీపీఎ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామకృష్ణ మాట్లాడుతూ కర్నూల్ మండలంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రధానమైనవి ఈ .తాంద్రపాడు గ్రామంలో వరదల సందర్భంగా పునరావాసం కింద 70 ఎకరాల భూమిలో 1500 మందికి పట్టాలు ఇచ్చారని, నేటికీ స్థలాలు చూపించక పోవడం సమంజసం కాదన్నారు. గొందిపర్ల గ్రామంలో చిప్పరౌస్ కొట్టాలలో దాదాపు 40 సంవత్సరాల నుండి 150 మంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, వారికి పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పశుపల గ్రామం, అంబేద్కర్ నగర్ గార్గేయపురం గ్రామాలలో వందలాదిమంది పేద ప్రజలు ప్రభుత్వ స్థలాల్లో వేసుకున్న కొట్టాలకు, ఇళ్లకు పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సీపీఎ మండల కార్యదర్శి హుస్సేనయ్య మాట్లాడుతూ ఉల్చాలా లాంటి అనేక గ్రామాలలో తాగునీటితో సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు, డ్రైనేజీల సౌకర్యం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల నాయకులు శ్రీరాములు, బాలపీరా, నరసింహ పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంపై సమీక్ష

మనగళం, కర్నూలు సిటీ : సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వ విభాగం సూచనల మేరకు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం కర్నూలు న్యాయ సేవ సదన్ నందు మధ్య వర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులతో మధ్యవర్తిత్వ కేసుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మధ్యవర్తిత్వం ద్వారా వీలైనంత ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని న్యాయవాదులకు సూచించారు. ఈ మీడియేషన్ ప్రక్రియ లో న్యాయవాదుల సహాయ సహకారాలు ఉంటే కేసులు ఎక్కువగా పరిష్కారమైతాయని తెలిపారు



# సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలి



- జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

మనగళం, కర్నూలు సిటీ : సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం,2007 అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు, తల్లిదండ్రుల నిర్వహణ, సంక్షేమం కోసం సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం,2007 ను ప్రవేశపెట్టారన్నారు. తమను తాము ఆర్థికంగా పోషించుకోలేని తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లకు ఆర్థిక సహాయం సంరక్షణ అందించాలని ఈ చట్టం నిర్దేశిస్తుందన్నారు. నేటి సమాజంలో బంధాలు, అనుబంధాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు తమను చూసుకోవడం లేదని పిజిఆర్ఎస్ లో ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గుడివాడ ఆర్డీవో గా 2011 లో ఈ చట్టాన్ని అమలు చేస్తూ తల్లిదండులను నిర్లక్ష్యం చేసిన ఒక వ్యక్తికి రూ. 10 వేలు నిర్వహణ మొత్తాన్ని మంజూరు చేయాలని ఫస్ట్ ఆర్డర్ పాస్ చేశానని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలు సంరక్షించని పక్షంలో మెయింటెనెన్స్ కోసం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ లేదా ఆర్డీవో కు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. నిర్వహణ ట్రిబ్యునల్ ద్వారా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ లేదా ఆర్డీవో లు ఈ దరఖాస్తులను విచారించి నిర్వహణ మొత్తాన్ని నెలకు గరిష్ట పరిమితి రూ. 10 వేలు విధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి సీనియర్ సిటిజన్స్ హక్కులను కాపాడాలని, చట్ట ప్రకారంగా వైద్య సదుపాయాలు, వారికి లభించే అన్ని హక్కులను అందచేయాలని కలెక్టర్ సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. డివిజన్ల వారీగా ఎన్ని కేసులు వచ్చాయి అని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను అడిగి తెలుసుకున్నారు.వృద్ధాశ్రమాలు ఉన్నాయని, వాటిని జిల్లా అధికారులు విజిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అడ్వకేట్ మోహన కృష్ణ, రిటైర్డ్ డీఎస్పీ, అడ్వకేట్ పాపారావు, డా.నాగరాజు, రిటైర్డ్ ప్రిన్సిపల్ తదితరులు చట్టంపై అవగాహన కల్పించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రాయిస్ ఫాతిమా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రలు వేయించండి

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

మనగళం, కర్నూలు సిటీ : ఆగస్టు 12 వ తేదీన జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలనపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్కూల్ పిల్లలు, కాలేజీ విద్యార్థులకు నులి పురుగుల నివారణ ఆవశ్యకత గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. 1-19 సంవత్సరాల వారికి ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఈ మాత్రలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో శాంతికళ మాట్లాడుతూ ఆల్బెండజోల్ 400 మిల్లి గ్రాముల మాత్రను భోజనం తర్వాత తీసుకునే విధంగా సూచించాలని కోరారు. చిన్న పిల్లలకు 1-2 సంవత్సరాల వయసు వారికి సగం టాబ్లెట్ (200 మిల్లీగ్రామ్స్) మాత్రను పొడిచేసి నీటి తో తాగించాలని సూచించారు. చిన్నపిల్లలు 3-9 సంవత్సరాల వారు నమిలి చప్పరించి తీసుకునే విధంగా తెలపాలన్నారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, డిప్యూటీ డీఎం హెచ్ ఓ భాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# సిపిఐ జిల్లా 24 వ మహాసభల గోడపత్రికను ఏఐటీయూసీ కార్యలయంలో విడుదల చేసిన సిపిఐ నేతలు

మన గళం కోడుమూరు: సిపిఐ జిల్లా 24 వ మహాసభల గోడపత్రిక ను బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు రాజు, శేషుకుమార్, దూల్ల భాస్కర్, మాధవస్వామి, ఎఐ యస్ఎఫ్ నాయకులు రంగస్వామి లు మాట్లాడుతూ పేద ప్రజలకోసం సిపిఐ పార్టీ నిరంతరం పనిచేస్తుందని అన్నారు. సమసమాజ స్థాపన, శాస్త్రీయ సోషలిజం ధ్యేయంగా పుట్టిన సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని నేడు కర్నూలు లో 24 వ మహాసభ లు జరుపుకొంటుందని అన్నారు. జిల్లా మహాసభలు శనివారం 10 గంటలనుండి కర్నూలులోని జిల్లా పరిషత్ నుండి భారీ ప్రదర్శన ప్రారంభమై కర్నూలులోని పాత బస్టాండ్ లోని కొండారెడ్డి బురుజు వరకు ఉంటుందన్నారు. అక్కడ భాహిరంగ సభ ఉంటుందన్నారు. కోడుమూరు నియోజకవర్గం లోని ప్రజల సమస్యలను సాగునీటి ప్రాజెక్టులు, త్రాగునీటి సమస్యలు డిగ్రీ కళాశాలను ఏర్పాటు చెయ్యాలనే సమస్యలను జిల్లా మహాసభలకు తీసుకెళ్లి తీర్మానంతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని సిపిఐ పార్టీ పోరాట పటిమను మరింత ముందుకు తీసుకుపోతుందని వారు అన్నారు. హమాలీ సంఘము నాయకులు విశ్వనాథ్, సుంకన్న మోటార్ వర్కర్స్ నాయకులు అశోక్, ఖాసీం, వెంకటేష్, సిపిఐ నాయకులు బాబురావు తదితరులు పాల్గొన్నారు.




# తాగునీటి సమస్య పరిష్కరించండి



మనగళం, కర్నూలు సిటీ : తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ బుధవారం 17వ వార్డు లక్ష్మీ గార్డెన్ కొట్టాల వాసులు సీపీఎం నగర కమిటీ సభ్యురాలు బంగి పద్మ ఆధ్వర్యంలో వార్డు సచివాలయంలో అడ్మిన్ కు వినతి పత్రం అందజేశారు. గత 17 సంవత్సరాల నుండి కాపురము ఉంటున్నామని, తాగునీటిని సక్రమంగా అందజేయడంలేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కేవల అరగంట మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారని, కనీసం గంట వదలాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు జహ్రాబి సులోచన, మఖాభి అద్దాల బువ్వమ్మ, సువార్త తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంది


**– రూ.72 లక్షలు మంజూరు – రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మన్సూర్ అలీ ఖాన్**

మనగళం, కర్నూలు సిటీ : తమ కూటమి ప్రభుత్వం హజ్ యాత్రికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ చెప్పారు. కర్నూల్లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హజ్- 2025కు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతా ఎన్నుకుని హజ్ యాత్రను పూర్తి చేసుకొని వచ్చిన యాత్రికులకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పామన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ఎంచుకున్న 72 మంది యాత్రికులకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 2026 సంవత్సరం కూడా హజ్‌కి వెళ్లే వారు విజయవాడ నుండి హజ్ కి వెళ్తే రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తామన్నారు. హజ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఎంచుకోవాలని ఆయన సూచించారు.




# సున్నిపెంట లో ఘనంగా టిడిపి సమన్వయకర్త యుగంధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

మనగలం : మండల తెలుగు యువత అధ్యక్షుడు షేక్.సిరాజ్ ఆధ్వర్యంలో కేకు కటింగు శ్రీశైలం మండల టిడిపి సమన్వయకర్త వై.యుగంధర్ రెడ్డి 51 వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సున్నిపెంట బస్టాండ్ ఆవరణం నందు టిడిపి మండల తెలుగు యువ నాయకుడు షేక్.సిరాజ్ ఆధ్వర్యంలో 30 మంది యువకులతో బాణాసంచి పేల్చి,కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ తమ సమన్వయకర్త ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని దేవుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఎస్.నజీర్, బూత్ కన్వీనర్ సుబ్బు,సుధాకర్, రియాజ్, తదితరులు పాల్గొన్నారు...






గురువారం
07 - 08 - 2025

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

సభాపతికి గడువు

ప్రజాస్వామ్య స్ఫూర్తికి పట్టిన జాడ్యం ప్రజాప్రతినిధుల ఫిరాయింపులు. ఒక పార్టీ నుంచి ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు, ప్రజల అభీష్టానికి భిన్నంగా మరో పార్టీలోకి మారడం ప్రజాభిప్రాయాన్ని అపహాస్యం చేయడమే. ఈ దురంతాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత అందరికన్న ఎక్కువగా శాసన సభాపతులపై ఉన్నది. అటువంటి శాసన సభాపతి నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తే? అదే సమయంలో ముఖ్యమంత్రి పదవి కూడా అత్యంత కీలకమైనదే. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసి పదవీబాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి అందులోని నిబంధనలకు విరుద్ధంగా శాసనసభలోనే నోరు పారేసుకుంటే? రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారంలో ఈ రెండు ఉల్లంఘనలు బాహాటంగానే జరిగాయని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు వెలువరించిన తాజా తీర్పు ఓ మైలురాయి వంటిదని చెప్పాలి. పై రెండు పదవులకు సంబంధించిన కీలక వ్యాఖ్యలు అందులో చోటుచేసుకున్నాయి. అందులో అతిముఖ్యమైనది 'మూడు నెలల్లోగా' నిర్ణయం తీసుకోవాలనే గడువును సభాపతికి విధించడం. నిజానికి సంవత్సరానికి పైగా గడువు ఎప్పుడో ముగిసిపోయిందని సుప్రీంకోర్టు ఎత్తిచూపడం గమనార్హం. గత శాసనసభ ఎన్నికల తర్వాత పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముందువెనుకగా కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతలపై నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయ ప్రక్రియను మొదలుపెట్టాలని ఏకసభ్య ధర్మాసనం సూచించింది. దీనిపై ప్రభుత్వం అప్పీలు చేస్తే డివిజన్ బెంచ్ ఆ నిర్ణయాన్ని పక్కన పెడుతూ 'సహేతుకమైన వ్యవధి'లో స్పీకర్ నిర్ణయించవచ్చని పేర్కొన్నది. ఈ సహేతుకమైన అనేదానిని ఎంతదాకానైనా సాగదీయవచ్చనే అర్థంలో తీసుకున్నారు. అంతేకాకుండా న్యాయపరిశీలన పరిధిలోకి స్పీకర్ రారని, కనుక గడువు విధించలేరని భాష్యాలు కూడా వెలువడ్డాయి. ఈ ఆదేశాలను పక్కన పెడుతూ సుప్రీంకోర్టు తాజాగా చరిత్రాత్మకమైన తీర్పును వెలువరించింది. స్పీకర్‌కు న్యాయస్థానం గడువు విధించవచ్చా? అనే ధర్మ సందేహానికి తిరుగులేని భాష్యంతో సమాధానమిచ్చింది.

ఈ సందర్భంగా పదో షెడ్యూల్‌ను ఉదహరించడం జరుగుతున్నది. సాధారణరీత్యా సభాపతి నిర్ణయాలు న్యాయ పరిశీలన పరిధిలోకి రావన్నది నిజమే. కానీ, ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతను నిర్ణయించే విషయమై సభాపతి ట్రిబ్యునల్‌గా వ్యవహరించే సందర్భంలో సర్వోన్నత న్యాయస్థానం న్యాయ పరిశీలన కిందకు వస్తారని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఎందుకంటే దేశంలోని ట్రిబ్యునళ్లు అన్నీ కూడా సుప్రీంకోర్టు పరిధిలోకే వస్తాయి. ఎఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ఏమిటో తేలిపోయింది. ఇన్నాళ్లూ తాత్సారం చేస్తూ న్యాయాన్ని దక్కకుండా చేసిన శాసనవ్యవస్థ, రాజకీయ లబ్ధి కోసం ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కార్యనిర్వాహక పరిపాలనా వ్యవస్థ ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన పరిస్థితిలో పడ్డాయి. మరీ ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై కోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. ఉపఎన్నికలు రావని శాసనసభా వేదికపైనే ఆయన రాజ్యాంగ నియమాల పట్ల పూర్తి అగౌరవంతో మాట్లాడటంపై సుప్రీం అక్షింతలు వేసింది. ఇక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. అఈ మధ్య తరచుగా ఆయన రాజ్యాంగం ప్రతిని చేతిలో పట్టుకుని విలువల గురించి ప్రబోధిస్తున్నారు. కానీ, అదే రాజ్యాంగంలో తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ తెచ్చిన 52వ రాజ్యాంగ సవరణ ఉందనే సంగతి మరిచిపోతున్నారు. ఫిరాయింపులను నిరోధించేందుకు తండ్రి తెచ్చిన ఆ సవరణకే ఇప్పుడు తనయుని ఆధ్వర్యంలో అదే కాంగ్రెస్ తూట్లు పొడుస్తున్నది. ఏదేమైనప్పటికీ న్యాయ నిర్ణయం జరిగిపోయింది. ఏవి పాలో, ఏవి నీళ్లో తేలిపోయింది. 'మూడు నెలలలోగా.. వీలైనంత త్వరలో' అని సుప్రీంకోర్టు కర్తవ్యబోధ చేసింది. మరింత జాగు చేయకుండా నిర్ణయం తీసుకుని ప్రజాతీర్పును గౌరవించేందుకు, గీతదాటిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ చర్య తీసుకుని న్యాయవ్యవస్థ పట్ల తమ గౌరవమర్యాదలు చాటుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

## అధిక ధరలకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు..జ్యోతి.

మన గళం సంజామల : నంద్యాల జిల్లా సంజామల మండలంలో ఎరువుల దుకాణం యజమానులు యూరియాని అధిక ధరకు విక్రయిస్తే షాప్ యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి జ్యోతి బుధవారం తెలిపారు. మండలంలోని పేరు సోమల గ్రామంలో పలు ఎరువుల దుకాణాలను తనికి చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ సంజామల మండలం లోని రైతులు మండలంలోని ఏ ఎరువుల దుకాణంలోనైనా యూరియాను కొనుగోలు చేయొచ్చు, కొనుగోలు చేయడానికి వెళ్లిన రైతులకు దుకాణంలో యూరియా నిల్వ ఉంచుకొని సరుకులు లేవు అని చెప్పిన, ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎక్కువగా వసూలు చేసిన తమను సంప్రదించాలని మండల రైతులకు తెలియజేశారు.



## పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

మనగళం, కల్లూరు : కల్లూరు మండల పరిధిలోని పర్ల జెడ్పీ హై స్కూల్ లో మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు తమవంతుగా రూ. 11 వేలు అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ సరోజ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణకు పూర్వ విద్యార్థులు నగదు అందజేశారు. పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా చైర్మన్, హెచ్ఎం అభినందించారు. హైస్కూల్ లో మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని హెచ్ఎం కోరారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శివ, వెంకటేష్, అశోక్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.




## మెరుగైన వైద్య సేవలు అందించాలి

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, గోస్పాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రం గోస్పాడులో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు సేవ కేంద్రం, ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు ? ఎన్ని డెలివరీ కేసులు నమోదు అయ్యాయి ? మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా ? అని ఆరా తీశారు. గడువు తేది ముగిసిన ఔషధాలను ఏం చేస్తున్నారు అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అవ్వడం శ్రేయస్కరం అనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా డెలివరీలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వైద్య చికిత్స కోసం వచ్చిన వారితో కూడా కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఏ సమస్యతో ఆసుపత్రికి వచ్చారు, వైద్యులు బాగా చూస్తున్నారా, వైద్య సేవలు ఎలా ఉన్నాయి, టెస్టులు ఇక్కడే నిర్వహిస్తున్నారా లేదా తదితర విషయాలను పేషంట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోని రైతు సేవ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎంత మేర రైతుల పొలాలు రైతు సేవా కేంద్రంలో నమోదు అయ్యాయి... ఈ పంట నమోదు, రైతుల ఈ-కేవైసీ పూర్తి చేశారా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. యూరియా లభ్యత ఎంత మేర ఉంది, ఇంకా అదనంగా ఎంత మేర అవసరం అనే విషయాలను రైతు సేవా కేంద్రం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదనంతరం మండల కేంద్రంలోని శ్రీ వెంకట సాయి ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. దుకాణంలో ఎరువులు, డిఏపి ఎంత మేర నిల్వలు ఉన్నాయని రిజిస్టర్లను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని దుకాణదారులను కలెక్టర్ హెచ్చరించారు.







## ఘనంగా వాసవీ మాత ఆలయ పునర్ ప్రతిష్ట

– ప్రత్యేక పూజలు చేసిన టీజీ వెంకటేష్

మనగళం, వెలుగోడు : నంద్యాల జిల్లా, మండల కేంద్రమైన వెలుగోడు గ్రామంలో శ్రీ వాసవీ మాత ఆలయం పునర్ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతులు పరమ పూజ శ్రీ ప్రజ్ఞ సరస్వతి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం జీర్ణోద్ధారణ పనులు చేపట్టారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో వేద మంత్రోచ్చారణల మధ్య యంత్ర ప్రతిష్ట, ధ్వజస్తంభ కలశ ప్రతిష్టాపన, మూర్తి ప్రతిష్ట ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలకు హాజరైన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ కు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద పండితుల ఆశీర్వచనాలతో సత్కరించారు. టీజీ వెంకటేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుల సురేష్, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగేంద్ర, ఆర్యవైశ్య ప్రముఖులు ఇల్లూరు లక్ష్మయ్య, రాజగోపాల్, శ్యాంసుందర్ లాల్, నాగ మహేష్, శ్యాంసుందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.





## బుగ్గన తనయుని రిసెప్షన్ కు మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి

మన గళండోన్ పట్టణంలోని ఈరోజు బుధవారం మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి కుమారుడు అర్జున్ రెడ్డి, అనన్యాల రిసెప్షన్ కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రావడంతో అభిమానులు భారీగా తరలివచ్చారు. వెంకటాపురం రోడ్డులోని ఎం కన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటుచేసిన హెలికాప్టర్ ప్రాంగణం నుండి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన రిసెప్షన్ జరుగుతున్న దత్తాత్రేయ స్వామి ప్రాంగణానికి చేరుకున్న వైఎస్ జగన్ నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా జగన్ ను చూసేందుకు అభిమానులు కేరింతలు కొడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అటు కర్నూలు నంద్యాల జిల్లా ల నుండి వైసిపి నాయకులు ఎస్వి మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్ప రవి చంద్రారెడ్డి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, మరియు నాయకులు, కార్యకర్తలు అభిమానులు నియోజక వర్గ ప్రజలు పెద్ద ఎత్తునపాల్గొన్నారు.





## శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (06.08.2025) ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానం సేవగా (సర్కారి సేవగా) నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

## సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (06.08.2025) శ్రీ సుమేదజ్యోషి, రంగారెడ్డి జిల్లా వారిచే సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో వినాయక కౌత్వం, శివాష్టకం, శివపార్వతికల్యాణం, నమశ్శివాయతే.. శివతాండవం, భో శంభో, తదితర గీతాలకు శ్రీవిద్య, మేదస్వి, దీక్షిత, కుశాల, స్పందన, రక్ష, గీతిక, పూజిత, గ్రీష్మ, సుమేధ, సహస్ర, నిధి, ఆదిత్రి, స్నిగ్ధ తదితరులు నృత్యప్రదర్శన చేయడం జరుగుతోంది. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిర్వహించబడుతున్నాయి. ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు





## సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (08.08.2025) శ్రీ జి. అరుణ మరియు వారి బృందం, హైదరాబాద్ వారిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో శరణు సిద్ధివినాయక, లింగాష్టకం, బిల్వాష్టకం, శివతాండవస్తోత్రం, కాలభైరవాష్టకం మరియు పలు శివకీర్తనలను అరుణ, శ్రీరామకృష్ణ, అతిథి తదితరులు ఆలాపిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తబల సహకారాన్ని శంకరరావు, వయోలిన్ సహకారాన్ని అర్జున్ అందిస్తున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా సంప్రదాయ నిర్వహించబడుతున్నాయి. నిత్యకళారాధన కార్యక్రమాలు దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (08.08.2025) శ్రీ జి. అరుణ మరియు వారి బృందం, హైదరాబాద్ వారిచే భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ భక్తిరంజని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో శరణు సిద్ధివినాయక, లింగాష్టకం, బిల్వాష్టకం, శివతాండవస్తోత్రం, కాలభైరవాష్టకం మరియు పలు శివకీర్తనలను అరుణ, శ్రీరామకృష్ణ, అతిథి తదితరులు ఆలాపిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తబల సహకారాన్ని శంకరరావు, వయోలిన్ సహకారాన్ని అర్జున్ అందిస్తున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన కళల పరిరక్షణలో భాగంగా సంప్రదాయ నిర్వహించబడుతున్నాయి. నిత్యకళారాధన కార్యక్రమాలు





## ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (06.08.2025) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి (జ్వాలావీరభద్రస్వామివారికి) విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేష అభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజను నిర్వహించబడుతుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది

## నందీశ్వరస్వామివారికి విశేషపూజలు





మనగళం శ్రీశైలం : ఈ రోజు (06.08.2025) మధ్యాహ్నానికి త్రయోదశి ఘడియలు రావడంతో. నందీశ్వరస్వామి వారికి పరోక్షసేవగా విశేషార్చన జరిపించబడుతోంది. ప్రతీ మంగళవారం రోజున మరియు త్రయోదశిరోజులలో దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. అయితే ప్రతి నెలలో కూడా త్రయోదశి రోజులలో అనగా శుద్ధ త్రయోదశి మరియు బహుళ త్రయోదశి రోజులలో భక్తులు నందీశ్వరస్వామివారి పూజను పరోక్షసేవగా జరిపించుకునే అవకాశం కూడా కల్పించబడింది. కాగా ఈ రోజు మొత్తం 21 మంది భక్తులు పరోక్షసేవగా ఈ నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకుంటున్నారు. ఈ పరోక్షసేవలో తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుండి కూడా భక్తులు ఈ విశేషపూజను నిర్వహించుకుంటున్నారు. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతోంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతోంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది.కాగా త్రయోదశి రోజున జరిపించబడే నందీశ్వరస్వామివారి పరోక్షసేవకు భక్తులు ఆన్లైన్ ద్వారా రూ.1,116/-లను సేవారుసుముగా చెల్లించాల్సి ఉంటుంది.

చెల్లింపు చేయవచ్చు.

నందీశ్వరస్వామివారి ఆరాధన వలన సంతానంలేనివారికి సంతానం కలుగుతుందని, సమస్యలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని, ఋణబాధలు తీరుతాయని, అనారోగ్యం తొలగి ఆరోగ్యం చేకూరుతుందని, కష్టాలు నివారించబడతాయని, మానసిక ప్రశాంతత చేకూరుతుందని పండితులు పేర్కొంటున్నారు. ఎజఅదేవిధంగా ఈ స్వామికి నానబెట్టినశనగలను సమర్పించడం వలన కోరిన కోరికలు నెరవేరుతాయని చెప్పబడుతోంది. అందుకే ఈ స్వామివారికి శనగలబసవన్న అనే పేరు కూడా ప్రసిద్ధంగా ఉంది. ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతున్నది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును. కావున భక్తులందరు కూడా ఈ పరోక్షసేవను సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాము.



## ఉచిత యోగా శిక్షణ



మనగళం శ్రీశైలం : స్థానికులు మరియు భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణా కార్యక్రమం ఈ రోజు (05.08.2025) చంద్రవతి కల్యాణమండపములో నిర్వహించబడింది. వారంలో రెండు రోజులపాటు అనగా ప్రతీ మంగళ, బుధవారాలలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఈ ఉచిత యోగా శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించద్దాయి. మనరాష్ట్రంతో పాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలలో యోగా శిక్షణను ఇచ్చిన ప్రముఖ యోగా గురువు యోగాచార్య శ్రీ గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం మరియు వారి బృందం, ఒంగోలువారు ఈ శిక్షణను ఇస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ముందుగా యోగాచార్య శ్రీ గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం, ఒంగోలువారు మాట్లాడుతూ యోగా ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం అందరిచేత ధ్యానం చేయించారు. తరువాత అందరి చేత సూక్ష్మవ్యాయమాన్ని చేయించడం జరిగింది. తరువాత యోగాచార్యులు సాధకుల చేత సూర్య నమస్కారాలు చేయించారు. ఈనాటి శిక్షణా కార్యక్రమానికి మొత్తం 130 మందికి పైగా హాజరవ్వడం జరిగింది. ఆగమ పాఠశాల విద్యార్థులు, శివసేవకులు, స్థానికులు ఈ యోగా శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానం సిబ్బంది, స్థానికులు మరియు యాత్రికులకు యోగాపై అవగాహన కల్పించేందుకు ఈ ఉచిత యోగశిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జీవితాన్ని ఆరోగ్యంగా తీర్చిదిద్దుకునేందుకు యోగా ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. మన వ్యక్తిత్వ వికాసానికి కూడా యోగా సాధన దోహదపడుతుందన్నారు.

## విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించండి



మనగళం, నంద్యాల : విద్యార్థలకు ఉపాధ్యాయులు ఆరోగ్య సూత్రాలు వివరించాలని నంద్యాల జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్య సభ్యులతో నంద్యాల జిల్లా వైద్య అధికారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 12వ తేదీ జరగబోయే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. భోజనం అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోలు మాత్రలు నమిలి చప్పరించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నులిపురుగులు నివారణ మాత్రను ప్రయోజనాలను విద్యార్థులకు వివరించాలన్నారు. చేతుల శుభ్రత అవసరాన్ని విద్యార్థులకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రవేట్ స్కూల్ యాజమాన్య కమిటీ ప్రెసిడెంట్ బాల మద్దిలేటి, జనరల్ సెక్రెటరీ భాస్కర్, జిల్లా అడ్వైజర్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆమడగుంట్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని అనుగొండ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించబడినది ఈ కార్యక్రమాన్ని ఏఈఓ బాలకృష్ణ మరియు ఎంఏఓ రవిప్రకాష్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు గుడ్డి పూలను తీసి పొలం గట్ల దగ్గర కాల్ చేయవలసిందిగా తెలపడం అయినది ఫ్లూ బెండమైడ్ ఎకరాకి 80 ఎంఎల్ స్ప్రే చేసుకుని గులాబీ రంగు పురుగుని నివారించుకోవచ్చు క్లోరంత్ర నిలిప్రోలు ఎకరాకు 100 %ఎశ్రీ% స్ప్రే చేసుకుని గులాబీ రంగు పురుగును నివారించుకోవచ్చు.

అలాగే లింగాకర్షక బుట్టలు ఎకరాకు 5 చొప్పున పెట్టుకోవాలి.

తెల్ల దోమ పచ్చ దోమ నివారణ కోసం పసుపు రంగు నీలిరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి ఈ సందర్భంగా వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆర్ఎస్కే సిబ్బంది మరియు రైతులు తదితరులు పాల్గొనడం జరిగినది.

## ఎయిర్‌టెల్ లాభంలో భారీ వృద్ధి

మనగళంభారతి ఎయిర్‌టెల్ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.49,463 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.5,947.9 కోట్ల లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 28.4్న, లాభం 43్న పెరిగాయి. ఒక్కో కస్టమర్‌పై సగటు ఆదాయం (ఆర్పు) గత ఏడాదితో పోల్చితే రూ.211 నుంచి రూ.250కి పెరిగింది. పోస్ట్ పెయిడ్ సబ్‌స్క్రైబర్లు పెరగడంతో నిర్వహణాపరమైన లాభం 54 శాతం పెరిగినట్టు తెలిపింది.



# కోడుమూరు గణేష్ ఉత్సవ కమిటీ సమావేశము





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో స్థానిక తుల్జా భవాని దేవస్థానం నందు గణేష్ ఉత్సవ కమిటీ వారు ముందస్తు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి కార్యదర్శి గోరంట్ల రమణ ఈ సమావేశానికి ముఖ్య ఆధిపత్యం వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూరులో యధావిధిగా మూడు రోజులు వినాయక ఉత్సవం జరుగుతుంది గణేష్ ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన వినాయక ఘాట్ నందు మొదటి రోజు వినాయక ఉత్సవం జరుగుతుంది రెండో రోజు గంగ హారతి జరుగుతుంది మూడో రోజు వినాయక నిమర్జన కార్యక్రమాన్ని పకడ్బందీగా వినాయక ఉత్సవ కమిటీ వారు అన్ని విధాలుగా తగు ఏర్పాట్లు చేసుకున్నామని భక్త బృందము వినాయకుని మండపాలు దగ్గర చక్కగా భజన ఏర్పాట్లు అలాగే సాంప్రదాయ నృత్యాలతో పండగ చేసుకోవాలని వారి ఈ సందర్భంగా తెలియజేశారు అలాగే సాధ్యమైనంత వరకు పర్యావరణాన్ని రక్షించే విధంగా ముందుకుపోయి మట్టి వినాయకులను ప్రతిష్టించాలని ఉత్సవ కమిటీ వారు మండప నిర్వహకులకు సూచనలు అందించారు ఈ కార్యక్రమంలో స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులు ఈశ్వర్ రెడ్డి మహేష్ రెడ్డి పరమేష్ రెడ్డి నాగేశ్వరరావు కమ్మరి శ్రీనివాసులు కిరణ్ ఏఎస్ఐ శంకర్ నాయక్ హెడ్ కానిస్టేబుల్ మురారి తదితర ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# శ్రీశైలంలో అన్యమత ప్రార్ధనలు కేసు నమోదు చేసిన పోలీసులు



మనగలం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం లోని వడ్డెర ప్రైవేట్ సత్రంలో అన్యమత ప్రార్ధన చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. సత్రంలోని సభ్యు డిగా ఉన్న కర్నూలుకు చెందిన వ్యక్తి ఓ పాప పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. అన్యమత ప్రార్ధనలు చేసి పాపను దీవిస్తున్నట్లుగా ఉన్న వీడియో వైరల్ గా మారింది. ఈ విషయంపై విరాట్ హిందుస్థాన్ సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవిం ద్ రెడ్డి మండిపడ్డారు. హిందువుల పుణ్య క్షేత్రంలోని సత్రంలో సభ్యుడిగా ఉండి ఇ వేం పనులని నిలదీశారు. ఈ విషయాన్ని దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకువె ళ్లారు. దీంతో దేవస్థానం సీఎస్ఓ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అన్యమత ప్రార్ధనలు చేసిన కర్నూలుకు చెందిన రమణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు శ్రీశైలం సీఐ ప్రసాదరావు

# టాటా క్యాపిటల్ మెగా ఐపీవో డ్రాఫ్ట్ పేపర్స్ దాఖలు

మన గళం బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ టాటా క్యాపిటల్.. దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశించేందుకు రంగం సిద్ధమవుతున్నది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వద్ద రూ.17,200 కోట్ల మెగా ఐపీవో కోసం అప్‌డేట్ చేసిన డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసింది. వీటి ప్రకారం మొత్తం 47.58 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టనున్నారు. ఇందులో 21 కోట్ల ఈక్విటీ షేర్లు ఫ్రెష్ ఇష్యూగా, 26.58 కోట్ల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)గా రానున్నాయి. కాగా, ఓఎఫ్ఎస్‌లో టాటా సన్స్ ద్వారానే 23 కోట్ల షేర్లు సేల్‌కు వస్తున్నాయి. అలాగే ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను అమ్మేయనున్నది.




# విండోస్ 10 యూజర్లకు మైక్రోసాఫ్ట్ గుడ్‌న్యూస్..!




మన గళం విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్ వాడుతున్న యూజర్లకు అలెర్ట్. ఈ ఏడాది అక్టోబర్ 14 తర్వాత నుంచి మైక్రోసాఫ్ట్ అప్‌డేట్స్, సెక్యూరిటీ ప్యాచ్‌లను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఇకపై ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌కు సంబంధించి అన్ని సేవలు నిలిచిపోనున్నాయి. అయితే, ఇప్పటికప్పుడు యూజర్లు అందరూ భయపడాల్సిన అవసరమేమీ లేదు. సాధారణ ట్రిక్‌తో సంవత్సరం పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను పొందే అవకాశం ఉన్నది. మైక్రోసాఫ్ట్ విండోస్ 10 యూజర్ల కోసం ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ పేరుతో ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇప్పటికప్పుడు విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్‌కి మారకుండా, హార్డ్‌వేర్ సపోర్ట్ చేయని యూజర్లను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోగ్రామ్‌ను తీసుకు వచ్చింది. వినియోగదారులు ఇందులో వినియోగదారులు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను పొందుతారు. అయితే, కొత్త ఫీచర్లు, టెక్ సపోర్ట్ మాత్రం ఉండదు. అయితే, ఈ సేవలను పొందేందుకు యూజర్లు 30 డాలర్లు (రూ.2500) ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. పీసీ బ్యాకప్ చేసి ఉంటే.. మైక్రోసాఫ్ట్ రివార్డ్ పాయింట్లు ఉంటే ఈ సేవలను మాత్రం ఉచితంగా పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మీరు వాడుతున్న విండోస్ 10 సిస్టమ్ వాడుతున్న అందరికీ మైక్రోసాఫ్ట్ ఉచితంగానే విండోస్ 11 ఉచితంగా ఇన్‌స్టాల్ చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నది. 10 ఓఎస్‌ను కొనసాగించాలనుకునే వారికి ఈఎస్‌యూ తీసుకోవచ్చని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు.

# బీరకాయను అవాయిడ్ చేస్తున్నారా..?



మన గళం మన వంటింట్లో దొరికే కూరగాయలలో బీరకాయ కూడా ఒకటి. ఈ బీరకాయను ఉపయోగించి ఎన్నో రకాల రెసిపీలు తయారు చేస్తూ ఉంటారు.. అయితే కొందరు బీరకాయను లొట్టలు వేసుకొని తింటే, మరికొందరు అసలు బీరకాయ తినడానికి ఇష్టపడరు.ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది.. కాబట్టి అత్యధిక నీటిశాతం కలిగిన బీరకాయను ఎండాకాలంలో తింటే చాలా మంచిది. మరి కేవలం ఇవి మాత్రమే కాకుండా ఎండాకాలంలో బీరకాయలు తినడం వల్ల ఇంకా ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. బీరకాయ అనేది పోషకాలతో నిండిన కూరగాయ. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ కె, ఫోలేట్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు దాగున్నాయి. ఇవి మన శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా అవసరం. బీరకాయ ముఖ్యంగా తక్కువ కేలరీలు కలిగి ఉండటంతో పాటు శక్తి వనరు. ఇది అధిక మొత్తంలో నీరు, ఫైబర్ కలిగి ఉంటుంది. ఇది ఆహారాన్ని నిల్వ చేయడంలో సహాయపడుతుంది. ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అందువల్ల, బీరకాయ కూరగాయ బరువు నియంత్రణకు గొప్ప ఎంపికగా పరిగణిస్తారు. బీరకాయలో మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది తిన్న తర్వాత, సాధారణంగా గ్యాస్ లేదా అజీర్ణం గురించి ఆందోళన ఉండదు. బీరకాయలో పెద్ద మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా పరిగణిస్తారు. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే బీరకాయ పేగులను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. బీరకాయ పేగులను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అనేక లక్షణాలు ఉన్నాయి. ఇందులో విటమిన్ ఎ, ఫైబర్ ఉన్నాయి. ఇది పొట్టను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. మరి ఇన్ని ప్రయోజనాలు ఉన్న బీరకాయను అవాయిడ్ చేస్తుంటే వెంటనే తినడం మొదలు పెట్టండి.

# వేసవిలో పుచ్చకాయను తెగ తినేస్తున్నారా..




మన గళం పుచ్చకాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఇందులో 90 శాతం నీరు ఉంటుంది. పుచ్చకాయ వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. అంతేకాకుండా వీటివల్ల ఎన్నో రకాల లాభాలు కూడా ఉన్నాయి. అయితే పుచ్చకాయలు మనకు ఎక్కువగా వేసవిలో లభిస్తూ ఉంటాయి. అందుకే వేసవి కాలంలో పుచ్చకాయను ఎక్కువగా తింటూ ఉంటారు. పుచ్చకాయ తినడం వల్ల విటమిన్స్ మినరల్స్ శరీరానికి అందుతాయి. ఇందులో ఉండే పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు డీహైడ్రేషన్ నుంచి కాపాడతాయి. అదేవిధంగా చర్మాన్ని పొడిబారకుండా హైడ్రేట్ గా ఉండేలా చేస్తుంది. అయితే వేసవి కాలంలో పుచ్చకాయ తినడం మంచిది అని చాలామంది తెగ తినేస్తూ ఉంటారు. మరి పుచ్చకాయను ఎక్కువగా తింటే ఏం జరుగుతుంది? వేసవిలో తినడం వల్ల ఇలాంటి ప్రయోజనాలు కలుగుతాయి ఇప్పుడు మనం తెలుసుకుందాం.. వేసవి తాపం నుంచి రక్షించే పండ్లలో పుచ్చకాయ మొదటి స్థానంలో ఉంటుంది. చల్లదనంతో పాటు, తాజాగా తినగలిగే పండు ఇది. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి. వీటి విత్తనాలు కూడా చాలా రకాల ప్రయోజనాలను చేకూరుస్తాయి. పుచ్చ గింజలు ఐరన్, పొటాషియం, విటమిన్లతో నిండి ఉంటాయి. పుచ్చపండుతో పాటు గింజలను తినడం వల్ల అనేక రకాలైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. అతిదాహం, చెమట ద్వారా వచ్చే ఖనిజ లవణాల లోపాలను పుచ్చకాయ తగ్గిస్తుంది. జ్వరంతో బాధపడేవారు పుచ్చకాయ రసంలో తేనె కలిపి తీసుకుంటే నీరసం తగ్గి తక్షణ శక్తి పుంజుకుంటారు. మలబద్ధకం ఉన్నవాళ్లు ప్రతిరోజూ తింటే సమస్య తగ్గుతుంది. పెదవుల్లో తేమ తగ్గకుండా కాపాడుతుంది. ఈ పండులో ఉన్న నీటి శాతం వల్ల మూత్రం సరిగ్గా రానివారు, మూత్ర విసర్జనలో మంట ఉన్నవారికి పుచ్చకాయ చక్కని ఔషధంగా పనిచేస్తుంది.

# తమలపాకు తులసి గింజలను కలిపి తింటే



మన గళం మామూలుగా చాలామంది ఈ తమలపాకు తినే అలవాటు ఉంటుంది. ఈ తమలపాకుని పాన్ బీడా, పాన్, ఇంకా కొన్ని కొన్ని పదార్థాల ద్వారా తమలపాకులు తీసుకుంటూ ఉంటారు. తమలపాకును తినడానికి ఇష్టపడేవారు తమలపాకు, జర్దా, సున్నం కలిపి తింటే ఆరోగ్యానికి చాలా హానికరం.అయితే ప్రతి నాణేనికి రెండు వైపులా ఉన్నట్టుగానే తమలపాకు తినడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. తమలపాకు లోని ఆస్ట్రింజెంట్ ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గిస్తుంది. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది అనేక విధాలుగా ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడుతుంది. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరంలోని అనేక రకాల బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది. వాతావరణంలో మార్పు కారణంగా శరీరంలో అనేక రకాల సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్యలలో జలుబు, దగ్గు కూడా ఒకటి. జలుబు అనేది ఒక సాధారణ అనారోగ్య సమస్య. కానీ కరోనా వైరస్ తర్వాత ఈ వ్యాధి సాధారణమైనది కాదు. అటువంటి పరిస్థితిలో తమలపాకులు, తులసి గింజలతో కలిపి తింటే చక్కటి ఫలితం ఉంటుంది. ఇది జలుబు, దగ్గు సమస్యను దూరం చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, దృఢత్వం నుండి ఉపశమనం లభిస్తుంది. ఈ తమలపాకుపాటు తులసి గింజలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ కూడా బలంగా ఉంటుంది. దీంతో పొట్ట సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. తులసి గింజలను తమలపాకులతో కలిపి తీసుకుంటే మలబద్ధకం, గ్యాస్ సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. తమలపాకులు, తులసి గింజలు కలిపి తీసుకోవటం వల్ల చిగుళ్ల వాపు, దంతాల పసుపు నుండి కూడా ఉపశమనాన్ని అందిస్తాయి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చిగుళ్లలో వాపు, గడ్డలు, రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తాయి. చాలా సార్లు నోటి నుండి దుర్వాసన సమస్య ఉంటుంది. ఈ దుర్వాసన చాలాసార్లు బ్రష్ చేసినా, కడిగినా పోదు. అయితే తమలపాకులో తులసి గింజలు వేసి క్రమం తప్పకుండా తీసుకుంటే నోటి దుర్వాసన సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

# టాలీవుడ్ డైరెక్టర్‌తో సినిమాకు జాక్వెలిన్ ఫెర్నాండేజ్ గ్రీన్ సిగ్నల్..!



మన గళం కిక్, రేస్, రైడ్, వెల్‌కమ్, హౌస్‌ఫుల్, ఫతేహ్ సినిమాలతోపాటు చాలా ప్రాజెక్టుల్లో మెరిసింది శ్రీలంకన్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్. ఈ భామ ఫీ మేల్ సెంట్రిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఓ వైపు అందాలను ఆరబోస్తూనే.. మరోవైపు నటనకు ఆస్కారమున్న పాత్రలను చేస్తూ సిల్వర్ స్క్రీన్‌పై తనదైన ముద్ర వేసుకున్న బాలీవుడ్ భామల్లో ఒకరు జాక్వెలిన్ ఫెర్నాండేజ్. ఈ శ్రీలంకన్ బ్యూటీ కిక్, రేస్, రైడ్, వెల్‌కమ్, హౌస్‌ఫుల్, ఫతేహ్ సినిమాలతోపాటు చాలా ప్రాజెక్టుల్లో మెరిసింది. ఈ భామ ఫీ మేల్ సెంట్రిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. జాక్వెలిన్ ఫెర్నాండేజ్ టాలీవుడ్ డైరెక్టర్‌తో సినిమా చేసేందుకు రెడీ అయిందన్న వార్త ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. పేపర్ బాయ్, అరి సినిమాలతో డైరెక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు వీ జయ శంకర్. ఈ డైరెక్టర్ ఓ స్క్రిప్ట్‌ను జాక్వెలిన్ ఫెర్నాండేజ్‌కు వివరించగా.. కథనం, తన పాత్ర నచ్చడంతో జాక్వెలిన్ ఫెర్నాండేజ్ వెంటనే సినిమాకు ఓకే చెప్పిందని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లింగ్ వీఎఫ్‌ఎక్స్ ఎలిమెంట్స్‌తో డిజైన్ చేసిన స్క్రిప్ట్ ప్రేక్షకులను సరికొత్త అనుభూతిని అందించడం పక్కానట. అంతేకాదు మేకర్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. తాజా టాక్ ప్రకారం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో రాబోతున్నట్టు సమాచారం. డైరెక్టర్ జయశంకర్ స్క్రిప్ట్‌కు ఫైనల్ టచ్ ఇచ్చే పనిలో బిజీగా ఉన్నాడని.. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే త్వరలోనే సెట్స్‌పైకి తీసుకెళ్లడం ఖాయమని ఇన్‌సైడ్ టాక్. యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో జాక్వెలిన్ ఫెర్నాండేజ్ ఇదివరకెన్నడూ చూడని నయా అవతార్‌లో కనిపించబోతుందట.

# అందమైన చందమామలా మెరిసిపోతున్న ఆషికా



మన గళం : ఇండస్ట్రీలో మెగా ఫ్యాన్స్ మొత్తం ఎదురుచూస్తున్న సినిమాల్లో విశ్వంభర ఒకటి. మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు వశిష్ట దర్శకత్వం వహిస్తున్నాడు. బింబిసార సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్న వశిష్ట కు చిరు మెగా చాన్స్ ఇచ్చాడు.దీంతో ఆ ఛాన్స్ ను సద్వినియోగం చేసుకొనే పనిలో పడ్డాడు ఈ కుర్ర డైరెక్టర్. ఇక మొట్ట మొదటిసారి చిరు సినిమాను యూవీ క్రియేషన్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. ఈ సినిమాలో చిరు సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తుంది.ఇప్పటికే వీరిద్దరి కాంబోలో స్టాలిన్ సినిమా వచ్చింది. దీంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశానికి తాకాయి. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. త్రిష తో పాటు విశ్వంభరలో మరో హాట్ బ్యూటీ కూడా నటిస్తుంది. ఆమె ఆషికా రంగనాథన్. నా సామీ రంగ సినిమాలో నాగ్ సరసన నటించి విమర్శకుల ప్రశంసలను సైతం దక్కించుకున్న ఆషికా ఆ తరువాత అడపదడపా సినిమాల్లో కనిపిస్తూ వచ్చింది. ఇక చివరగా ఈ ముద్దుగుమ్మ మెగా ఛాన్స్ పట్టేసింది. విశ్వంభరలో ఆషికా ఒక కీలక పాత్రలో నటిస్తోంది. అంటే సెకండ్ హీరోయిన్ గా చిరు సరసన నటించే ఛాన్స్ అనే చెప్పుకొస్తున్నారు. నేడు ఆషికా పుట్టినరోజు కావడంతో ఆమెకు బర్త్ డే విషెస్ తెలుపుతూ న్యూ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో నిండైన చందమామలా లంగా ఓణీ వేసుకొని అచ్చ తెలుగు ఆడపడుచులా కనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఈ సినిమా ఆషికాకు మంచి పేరు వస్తుందనే ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ ఒక ఐటెంసాంగ్ లో నటిస్తోంది. ఈ సినిమాపై మెగా అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. త్వరలోనే విశ్వంభర ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ సినిమాతో ఆషికా ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# నన్నంతా అలా గుర్తుపెట్టుకోవాలి



మన గళం అగ్ర నటుడు ఎన్టీఆర్ క్రేజీ రికార్డును సొంతం చేసుకున్నారు. ఆయన ముఖచిత్రంతో కూడిన ప్రముఖ మాగజైన్ 'ఎస్క్వైర్ ఇండియా' తాజా ఎడిషన్ మార్కెట్లోకి విడుదలైంది. ఎన్టీఆర్ ఫొటోతో కూడిన ఈ మాగజైన్ కవర్‌పేజీ ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. ఈ మాగజైన్‌కి సంబంధించిన ఫొటో షూట్ దుబాయ్‌లో జరిగిందని సమాచారం. ఈ క్రమంలో 'ఎస్క్వైర్ ఇండియా'కు తారక్ కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. 'నా జీవితం విషయంలో ఏదీ నేను ప్లాన్ చేసుకోలేదు. 'కుంగ్ ఫూ పాండా'లో ఒక కొటేషన్ నాకెంతో ఇష్టం. 'నిన్నటి రోజు చరిత్ర.. రేపటి రోజు తెలియని మర్మం.. కానీ ఈ రోజు మన చేతిలో ఉన్న గొప్ప బహుమతి'. నా మనసులో నాటుకు పోయిన కొటేషన్ ఇది. అందుకే నా దృష్టి ఎప్పుడూ వర్తమానంపైనే ఉంటుంది. ఒక నటుడిగా నేను ఏది చేయడానికైనా సిద్ధమే. ఇక నా సినీ వారసత్వం గురించి ఇప్పటికిప్పుడు నాకు తెలీదు. అది వారి వ్యక్తిగతం. ఆ విషయంలో నేను ప్లాన్ చేసేదేంలేదు. ప్రేక్షకుల మదిలో నిలిచిపోయే కథలు చెప్పడమే నా లక్ష్యం. భావోద్వేగాలతో కూడిన నిజాయితీ పరుడిగా నన్ను అందరూ గుర్తుపెట్టుకోవాలి. నా కోరిక అదొక్కటే.' అన్నారు ఎన్టీఆర్. బాలీవుడ్‌లో ఆయన నటించిన తొలి సినిమా 'వార్ 2' ఈ నెల 14న విడుదల కానున్న విషయం తెలిసిందే.

# ఫిఫా అకాడమీకి తెలంగాణ విద్యార్థి



మన గళం : భువనేశ్వర్ (ఒడిషా)లో ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్యతో కలిసి ఫిఫా నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ అకాడమీకి తెలంగాణ విద్యార్థి రుద్రాక్ష్ బన్సాల్ ఎంపికయ్యాడు. స్థానిక గ్లెండేల్ అకాడమీ, సన్ సిటీలో 9వ తరగతి చదువుతున్న రుద్రాక్ష్.. దేశవ్యాప్తంగా వేలాదిమంది ఆశావహ ఆటగాళ్ల మధ్య ఐదు కఠినమైన ఎంపికదశల్ని దాటి ఈ గౌరవాన్ని పొందాడు. ఫిఫా అకాడమీకి దేశవ్యాప్తంగా 19 మంది ఎంపికవగా తెలంగాణ నుంచి రుద్రాక్ష్ చోటు దక్కించుకోవడం విశేషం.

# ఆసియా కప్‌పై గురి.. బంగ్లాదేశ్ తాత్కాలిక బృందంలో 25 మంది..!



మన గళం బంగ్లాదేశ్ జట్టు ఆసియా కప్ కోసం సన్నాహకాలు షురూ చేసింది. మెగా టోర్నీకి ముందు స్వదేశంలో నెదర్లాండ్స్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది బంగ్లా. దాంతో, ఈ సిరీస్‌తో పాటు ఆసియా కప్‌ను దృష్టిలో ఉంచుకొని మంగళవారం సెలెక్టర్లు ప్రిలిమినరీ స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. లిటన్ దాస్ సారథిగా 25 మందితో కూడిన బృందాన్ని ప్రకటించారు. వికెట్ కీపర్ నురుల్, మాజీ కెప్టెన్ శాంటోలకు చోటు దక్కింది.

డచ్ జట్టుపై సిరీస్ విజయంతో ఆసియా కప్ పోటీలకు ఆత్మ విశ్వాసంతో వెళ్లాలనుకుంటోంది బంగ్లాదేశ్. ఈ సిరీస్ ముగియడమే ఆలస్యం.. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా ఆసియా కప్ మొదలవ్వనుంది. 'అందుబాటులో ఉన్న క్రికెటర్లు ఆగస్టు 6లోపు మిర్పూర్‌లోని ఫిట్‌నెస్ క్యాంప్‌లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 15 నుంచి నైపుణ్య శిక్షణ కొనసాగనుంది. ఆగస్టు 20 నాటికి క్యాంప్ సిల్హెట్‌కు తరలిపోనుంది' అని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. మూడు టీ20ల సిరీస్ కోసం నెదర్లాండ్స్ జట్టు ఆగస్టు 26న బంగ్లాకు రానుంది. ఆగస్టు 30న మొదటి మ్యాచ్, సెప్టెంబర్ 1న రెండో టీ20, సెప్టెంబర్ 3న మూడో మ్యాచ్ జరుగనున్నాయి.

ఆసియా కప్ తాత్కాలిక స్క్వాడ్ : లిటన్ దాస్(కెప్టెన్), తంజిద్ హసన్, నయీం షేక్, సౌమ్యా సర్కార్, మహ్మద్ పర్వేజ్ హొసేన్, తౌహిద్ హృదొయ్, జకీర్ అలీ అనిక్, మెహిదీ హసన్ మిరాజ్, షమీమ్ హొసేన్, నజ్ముల్ హుసేన్ శాంటో, రిషద్ హొసేన్, షక్ మహెదీ హసన్, తన్వీర్ ఇస్లాం, నసుం అహ్మద్, హసన్ మహ్మూద్, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ షకీబ్, సైఫుద్దీన్, నహిద్ రానా, ముస్తాఫిజుర్, షోరిఫుల్ ఇస్లాం, సయ్యద్ ఖలీద్ అహ్మద్, ఖాజీ నురుల్ హసన్, మహిదుల్ ఇస్లాం, మహ్మద్ సైఫ్ హసన్.

# స్వదేశానికి గిల్ సేన



మన గళం : ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకున్న యువ భారత జట్టు స్వదేశానికి తిరుగు ప్రయాణమైంది. ఓవల్ టెస్టు ముగిసిన తర్వాత మంగళవారం ఉదయమే భారత జట్టులోని పలువురు సభ్యులు లండన్‌ను వీడారు. లండన్ నుంచి దుబాయ్‌కు చేరుకునే ఆటగాళ్లు.. అక్కడ్నుంచి నేరుగా ఎవరి స్వస్థలానికి వారు వెళ్లనున్నారు. సిరాజ్, అర్ష్‌దీప్, శార్దూల్ ఇప్పటికే లండన్‌ను వీడగా పలువురు క్రికెటర్లు ఇంకా అక్కడే ఉన్నారు. సిరాజ్ దుబాయ్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు రానున్నాడు.

# ఆసియా కప్ రేసులో గిల్, జైస్వాల్

మన గళం : ముంబై : యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు ఓపెనర్ యశస్వీ జైస్వాల్, సాయి సుదర్శన్ త్వరలో జరుగబోయే ఆసియా కప్ సెలక్షన్స్‌కు అందుబాటులో ఉండనున్నారు. సెప్టెంబర్ రెండో వారంలో దుబాయ్ వేదికగా మొదలుకాబోయే ఈ టోర్నీ టీ20 ఫార్మాట్‌లో జరుగనుంది. ఆసియా కప్ ముగిసిన వెంటనే భారత్.. స్వదేశంలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడాల్సి ఉంది. జైస్వాల్, గిల్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ ఎక్కువగా టెస్టులకే వినియోగిస్తున్నా వాళ్లు గత జూన్‌లో ముగిసిన ఐపీఎల్‌లో అదరగొట్టారు. ఇంగ్లండ్‌తో టెస్టులు ముగిసిన నేపథ్యంలో ఆసియా కప్ ప్రారంభానికి ఇంకా నెలకు పైగా సమయం ఉండటంతో ఈ త్రయం మెగా టోర్నీ ఆడేందుకు ఆసక్తిగా ఉన్నట్టు బోర్డు వర్గాల వినికిడి.



# బాక్సర్ల జోరు




మన గళం : ఆసియా అండర్-19, 22 బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత యువ బాక్సర్ల జోరు కొనసాగుతున్నది. ఇప్పటికే ఈ టోర్నీలో అండర్-22 విభాగంలో సుమారు డజనుకుపైగా పతకాలు ఖాయమవగా మంగళవారం జరిగిన అండర్-19 విభాగంలో ఏకంగా ఏడుగురు అమ్మాయిలు సెమీస్ చేరుకుని పతకాలు ఖాయం చేసుకున్నారు. మంగళవారం జరిగిన క్వార్టర్స్ పోరులో యక్షిత (51 కిలోలు), నిషా (54 కి.), ముస్కాన్ (57 కి.), విని (60 కి.), ఆకాంక్ష (70 కి.), ఆర్తి కుమారి (75 కి.) తమ ప్రత్యర్థులను చిత్తుచేసి సెమీస్ చేరారు.

# తెలంగాణ స్విమ్మర్లకు రజతం, కాంస్యం

మన గళం : అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న జూనియ ర్ నేషనల్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లకు రెండు పతకాలు దక్కాయి. పురుషుల 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రాష్ట్రానికి చెందిన సుహాస్ ప్రీతమ్ (2:05 నిమిషాల 57 సెకన్లు) రజతం గెలిచాడు. బెంగాల్ స్విమ్మర్ కనిష్ చక్రవర్తి (2:04 నిమిషాల 98 సెకన్లు)కి పసిడి దక్కగా.. ఆంధ్రప్రదేశ్ ఆటగాడు తీర్థు (2:06 నిమిషాల 84 సెకన్లు)కాంస్యం గెలుచుకున్నాడు. మహిళల 400 మీటర్ల మెడ్‌లీ విభాగంలో శ్రీనిత్య (5:13 నిమిషాల 67 సెకన్లు) కాంస్యం గెలుచుకోగా కర్నాటకకు చెందిన శదాక్షరి, హర్షిక వరుసగా స్వర్ణ, రజత పతకాలు నెగ్గారు.


Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310